క్లుప్తంగా

గ్రామీణ వ్యవసాయంపై అవగాహన


విద్యార్థులతో కలిసి రైతులకు అవగాహన కల్పిస్తున్న పీసీ రాజకుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో గురువారం గ్రామీణ వ్యవసాయంపై అవగాహన, అనుభవం కార్యక్రమం నిర్వహించారు. కింజరాపు ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాల(ఎచ్చెర్ల) విద్యార్థులు మొబిలిటీ యాప్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శిక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సభ్యులు డాక్టర్ రాజకుమార్, డాక్టర్ ఎస్.కిశోర్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ రైతులకు పలు సూచనలిచ్చారు. విద్యార్థులకు అవసరమైన క్షేత్ర స్థాయి సూచనలు చేశారు. కార్యక్రమంలో కె.అలేఖ్య, ఆర్.భార్గవ్, పి.దుర్గాభవాని, ఎ.గౌతమి, ఎస్.మానస, పలువురు రైతులు పాల్గొన్నారు.

వైద్యురాలు విద్యావతి ఔదార్యం


విభిన్న ప్రతిభావంతులకు ఆట వస్తువులు అందజేస్తున్న డాక్టర్ విద్యావతి

సబ్బవరం: సబ్బవరంలోని భవిత కేంద్రానికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డెంటల్ డాక్టర్ ఎస్.విద్యావతి రూ.10 వేలు విలువ చేసే పిల్లల మానసిక ఉల్లాసానికి అవసరమైన బొమ్మలు, ట్రాంపోలిన్ అనే ఆట వస్తువును వితరణగా అందజేశారు. వీటిని సబ్బవరం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న విభిన్న ప్రతిభావంతుల విద్యా వనరుల కేంద్రం పిల్లలకు ఆమె స్వయంగా అందజేశారు.పాఠశాల ఉపాధ్యాయులు సింహాద్రి, రాణి, ఐసీటీసీ కౌన్సిలర్ ఎస్. రాజశేఖర్ తదితరులు విద్యావతికి కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటాద్రిపై ఘనంగా ఏకాదశి పూజలు



పెందుర్తి: కార్తీక ఏకాదశి సందర్భంగా గురువారం పెందుర్తి వెంకటాద్రిపై వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి సుప్రభాతసేవ, తోమాల సేవ చేశారు. అర్చకుడు మహర్షి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర పూజలు జరిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భారీ ఎత్తున ప్రసాద వితరణ చేపట్టారు. ఈవో ఎం.నీలిమ, ఆలయ కమిటీ చైర్మన్ రాజు, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.


ఏకాదశి పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆహ్లాదం.. ఆరోగ్యం



- సుజాతానగర్, చినముషిడివాడ ప్రాంతాల్లో సుందరంగా పార్కులు
- విలీన ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి పెద్దపీట
- ప్రభుత్వ చొరవపై సర్వత్రా హర్షం

ప్రజలకు ఆహ్లాదం.. ఆనందంతో పాటు ఆరోగ్యానికి దోహదం చేసే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జీవీఎంసీ విలీన ప్రాంతాల్లోని పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేసింది. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని పార్కులకు భారీస్థాయిలో నిధులు కేటాయించి అత్యాధునిక పార్కులుగా తీర్చిదిద్దుతోంది.

పెందుర్తి : పార్కులంటే కేవలం పిల్లలు ఆడుకోవడానికి, పెద్దలు సేదతీరడానికి మాత్రమే కాకుండా అన్ని వయసుల వారికి అవసరమైన హంగులను ప్రభుత్వం సమకూర్చింది. జీవీఎంసీ 95, 97 వార్డు ప్రాంతాల్లో గత రెండేళ్లలో దాదాపు 8 పార్కులను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు స్పోర్ట్స్ థీమ్, జిమ్‌లను సమకూర్చింది. తాజాగా పార్కుల్లో ప్రజల కనీస అవసరాల నిమిత్తం ఆధునిక మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేసేందుకు జీవీఎంసీ కసరత్తు చేయడం విశేషం


సుజాతానగర్ సీ-1 కిడ్డీ ఏరోప్లేన్

పార్కుల్లో వైవిధ్యభరిత ఏర్పాట్లు..

సుజాతానగర్ పార్కులు వేటికవి విభిన్నంగా ఉంటాయి. సుజాతానగర్ ఎ-జోన్ పార్కును రూ.70 లక్షలు (1:2) పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేశారు. ఈ పార్కులో జిమ్‌తో పాటు సోలార్ సిస్టం, ఆర్గానిక్ కూరగాయలు పండిస్తున్నారు. మొక్కలకు నీటి కోసం డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ఏర్పాటు చేశారు. సుజాతానగర్ బి-జోన్ పార్కును రూ.6 లక్షలు (పీపీపీ పద్ధతి)తో అభివృద్ధి చేశారు. ఎక్కువ స్థాయి ఆక్సిజన్ ఇచ్చే అరేక పాం, స్నేక్ ప్లాంట్, మనీ ప్లాంట్, రబ్బర్ ప్లాంట్, అలొవెర మొక్కలను ఈ పార్కులో పెంచుతున్నారు. సుజాతానగర్ సీ-1 జోన్ పార్కు అభివృద్ధికి పీపీపీ పద్ధతిలో రూ.6.60 లక్షల నిధులు కేటాయింపు జరిగితే దానికి అదనంగా 18 లక్షలు ప్రత్యేక నిధులు జీవీఎంసీ నుంచి కేటాయించి జిమ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు, జిమ్, షటిల్ కోర్టు, కిడ్డీ ఏరో ప్లేన్ ఏర్పాటు చేశారు. సీ-2జోన్‌లో పీపీపీ పద్ధతిలో రూ.25 లక్షల కేటాయింపు జరిగితే దానికి అదనంగా మరో రూ.40 లక్షలు కేటాయించి స్కేటింగ్ రింక్ ఏర్పాటు చేసి పార్కుకు రంగులు, వాకింగ్ ట్రాక్ చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

భారీ స్థాయిలో స్పోర్ట్స్ థీమ్ పార్కు..

రత్నగిరినగర్‌లో రూ.2 కోట్లతో స్పోర్ట్స్ థీమ్ పార్కును ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. అతిత్వరలో అందుబాటులోకి రానున్న ఈ పార్కులో క్రికెట్ నెట్, వాలీబాల్, రన్నింగ్ ట్రాక్, షటిల్ కోర్టుతో పాటు ఇతరత్రా అన్ని రకాల ఆటలు ఆడుకునేందుకు వీలుగా ఉంటుంది. ఇంత భారీ స్థాయిలో స్పోర్ట్స్ థీమ్ పార్కును ఏర్పాటు చేయడం నగర పరిధిలో ఇదే ప్రథమం.

-2020లో వేపగుంట సమీపంలోని షిప్‌యార్డ్ లేఅవుట్‌లో రూ.2 కోట్లతో పార్కుని అభివృద్ధి చేశారు. నాలుగేళ్ల క్రితం తుప్పలతో నిండి ఉన్న చినముషిడివాడ సత్యనగర్ పార్కును 2022లో రూ.2 కోట్లతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఈ ఏడాది ప్రారంభంలో లక్ష్మీనర్సయ్యమ్మ నగర్ (ఎస్‌ఏడీ లేఅవుట్)లోని పార్కును రూ.64 లక్షలతో ప్రభుత్వం అత్యంత సుందరంగా ముస్తాబు చేసింది.


సుజాతానగర్ సీ-1 జోన్ పార్కులో ఆటలాడుతున్న పిల్లలు


సుజాతనగర్ ఏ-జోన్ పార్కు (తొలిదశలో)


సుజాతానగర్ సీ-2 జోన్‌లో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టు

అన్ని సౌకర్యాలు సమకూర్చారు..



మా కాలనీలో పార్కు ఈ స్థాయిలో అభివృద్ధి చెందుతుందని మేం ఊహించలేదు. కొన్నాళ్ళ క్రితం కేవలం వాకింగ్ ట్రాక్ ఉండి నాలుగు బల్లలు ఉంటే చాలనే స్థితి నుంచి నేడు మా పార్కులో ఆహ్లాదం, ఆరోగ్యానికి సంబంధించిన అన్ని సౌకర్యాలు సమకూరాయి. ప్రభుత్వం పార్కుల అభివృద్ధికి ఇంతలా ముందుకు రావడం ఆహ్వానించదగ్గ విషయం. – టీవీ రమణమూర్తి, సుజాతానగర్ సీ–2 జోన్ కాలనీ ప్రతినిధి.

ఆరోగ్యం కాపాడుతున్నారు..



కొన్నాళ్ల క్రితం మా ప్రాంతంలోని పార్కుని చూస్తే భయంకరంగా ఉండేది. పిచ్చి మొక్కలు, తుప్పలు ఉండేవి. కానీ ప్రభుత్వం ముందుకు వచ్చి మా పార్కును అభివృద్ధి చేసి ఆక్సిజన్ అధికంగా అందించే మొక్కలు నాటారు. ఇక్కడ వాకింగ్ చేస్తుంటే ఆహ్లాదంగా ఉంటుంది. ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.

– పి.వెంకటరాజు, సుజాతానగర్ బి–జోన్ కాలనీ ప్రతినిధి

పర్యావరణాన్ని కాపాడుకోవాలి..



ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యం కాపాడుకోవాలంటే చుట్టూ ఉన్న వాతావరణం బాగుండాలి. కాలుష్యం అధికమవుతున్న క్రమంలో పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చొరవ తీసుకుని పార్కుల అభివృద్ధికి ముందుకు రావడం హర్షణీయం. మా ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తున్నాను.

– సుంకర విజయశేఖర్, సుజాతానగర్–సి–1 జోన్ కాలనీ ప్రతినిధి.

పార్కుల అభివృద్ధి ఇలా..

- రూ.70 లక్షలతో సుజాతానగర్ ఏ-జోన్ పార్కు అభివృద్ధి
- రూ.6 లక్షలతో సుజాతానగర్ బీ-జోన్ పార్కు అభివృద్ధి
- రూ.24.6 లక్షలతో సుజాతానగర్ సీ-1 జోన్ పార్కు అభివృద్ధి
- రూ. 65 లక్షలతో సుజాతానగర్ సీ-2 జోన్ పార్కు అభివృద్ధి
- రూ.2 కోట్లతో రత్నగిరినగర్‌లో స్పోర్ట్స్ థీమ్ పార్కు ఏర్పాటుకు చర్యలు
- రూ.2 కోట్లతో వేపగుంట సమీపంలోని షిప్‌యార్డ్ లేఅవుట్ పార్కు అభివృద్ధి


సుజాతానగర్ బీ-జోన్‌లో ఆక్సిజన్ అధికంగా ఉత్పత్తి చేసే మొక్కలు


సుజాతానగర్‌లో పార్కును ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కార్పొరేటర్ దేముడు (ఫైల్)


సుజాతనగర్ ఏ-జోన్‌లో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం

ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజల మద్దతు


సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: సంక్షేమం, అభివృద్ధిని పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని బోదువలస సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, పల్లెకు పోదాం కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల చెంతకే సంక్షేమ పాలన అందించారన్నారు. ఈ ప్రభుత్వం మహిళా సాధికారత, సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సచివాలయం వద్ద ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి పథకాల బోర్డును ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేబర్తి శ్రీను, ప్రోగ్రాం నియోజకవర్గ కన్వీనర్ కోటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఈవోపీఆర్‌డీ మహేష్, సచివాలయ కన్వీనర్లు ఉగ్గిన గంగునాయుడు, కోన సంజీవరావు, దొగ్గ దేముడు, పాల సొసైటీ అధ్యక్షుడు కోన బండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి


పేదలకు కుట్టుమిషన్లు అందిస్తున్న కంచిపాటి విశ్వనాథనాయుడు

పెందుర్తి: భగవాన్ సత్యసాయి 98వ జయంతి వేడుకలు గురువారం పెందుర్తిలో ఘనంగా నిర్వహించారు. సుజాతానగర్‌లో ఆనందసాయి ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో సత్యసాయి, షిర్డీసాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ, పారిశ్రామికవేత్త కంచిపాటి విశ్వనాథనాయుడు మాట్లాడుతూ సర్వ మానవాళికి భగవాన్ సత్యసాయిబాబా అందించిన సేవలు అజరామరమన్నారు. పేదలకు కుట్టు మిషన్లు, వస్త్రదానం చేశారు. విశ్వనాథనాయుడు సమకూర్చిన నారాయణ పట్టుచీరలను సత్యసాయి సేవా సంస్థకు చెందిన 70 మందికి అందించి అన్నసమారాధన నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు, సత్యసాయి సేవా కేంద్రం గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, కేంద్రం ప్రతినిధులు బుజ్జిబాబు, జ్యోతి, గోపి, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార సభ ఏర్పాట్ల పరిశీలన


బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: ఈ నెల 25న సబ్బవరంలో నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్రలో భాగంగా తలపెట్టిన బహిరంగ సభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సబ్బవరంలోని చోడవరం, దుర్గాలమ్మ ఆలయం సమీపంలో ఈ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నారు. ఏర్పాట్లను పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం పరిశీలించారు. బహిరంగ సభకు అవసరమైన వేదిక, ట్రాఫిక్ తదితర అంశాలకు సంబంధించి ఆయన నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రిబాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, మాజీ ఎంపీపీ గొర్లి ఉమామహేశ్వరరావు, సీఐ రంగనాథం, పార్టీ జిల్లా మహిళా కార్యదర్శి పద్మావతి, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ సబ్బవరపు నాగభూషణం, పెందుర్తి వైస్ ఎంపీపీ సిరికి దేముడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముమ్మన దేముడు

బస్సు యాత్ర విజయవంతానికి పిలుపు

పెందుర్తి: సబ్బవరంలో శనివారం తలపెట్టిన సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పిలుపునిచ్చారు. గురువారం చినముషిడివాడలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో దేముడు మాట్లాడుతూ బస్సుయాత్రకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి రావాలని కోరారు. పార్టీ నేతలు, గృహ సారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ


అయ్యప్పను దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు

పరవాడ: స్థానిక చిరికి వారి వీధిలో అయ్యప్ప స్వామి పడిపూజ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గురుస్వామి పైల వెంకటరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అరటి డొప్పలతో రూపొందించిన విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, లక్ష్మీదేవి, శివపార్వతులు, మణికంఠ సన్నిధాన మందిరం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అయ్యప్ప స్వామి మాలధారులు ఆలపించిన శరణుఘోష, అయ్యప్పస్వామి పాటలతో ఆ ప్రాంతం హోరెత్తింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పైల పోతినాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పీఠాధిపతి పైల పైడింనాయుడు, వార్డు సభ్యులు పైల హరీష్, స్వాములు చిరికి కృష్ణారావు, చీపురుపల్లి రఘు, గోర్లి శివ, కె.రవి, బండారు గోపి, చిరికి అప్పారావు, ఎ.లోవరాజు, పైల రామునాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీల భర్తీ

సబ్బవరం: సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు లేకపోవడం వల్ల జనరల్ కేటగిరీలో భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు 01-07-2023 నాటికి 21 నుంచి 35 ఏళ్ల వయసు గలవారై ఉండాలని చెప్పారు. ఓసీ రిజర్వేషన్ కేటగిరీలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల ఖాళీల వివరాలు

మండలం	పంచాయతీ పేరు	అంగన్‌వాడీ కేంద్రం	పోస్ట్ పేరు
పరవాడ	వాడచీపురుపల్లి	పోలిరెడ్డిపాలెం	అంగన్‌వాడీ కార్యకర్త
సబ్బవరం	సబ్బవరం	గణపతిపురం	మినీ అంగన్‌వాడీ కార్యకర్త
పరవాడ	కలపాక	మరిసివానిపాలెం	మినీ అంగన్‌వాడీ కార్యకర్త
పరవాడ	వాడచీపురుపల్లి	సర్పాపురం	మినీ అంగన్‌వాడీ కార్యకర్త
పరవాడ	పెదముసిడివాడ	విజయరామపురం	మినీ అంగన్‌వాడీ కార్యకర్త
సబ్బవరం	అంతకాపల్లి	రావలమ్మపాలెం-2	అంగన్‌వాడీ ఆయా
సబ్బవరం	నారపాడు	బలిజపాలెం	అంగన్‌వాడీ ఆయా
సబ్బవరం	వంగలి	వంగలి-2	అంగన్‌వాడీ ఆయా
సబ్బవరం	తవ్వవానిపాలెం	తవ్వవానిపాలెం-2	అంగన్‌వాడీ ఆయా
సబ్బవరం	అమృతపురం	అమృతపురం-2	అంగన్‌వాడీ ఆయా
సబ్బవరం	అమృతపురం	సూరెడ్డిపాలెం	అంగన్‌వాడీ ఆయా
సబ్బవరం	టెక్కలిపాలెం	నాయనమ్మపాలెం	అంగన్‌వాడీ ఆయా
పరవాడ	వాడచీపురపల్లి	గోరుసువానిపాలెం	అంగన్‌వాడీ ఆయా
పరవాడ	ముత్యాలమ్మపాలెం	దిబ్బపాలెం	అంగన్‌వాడీ ఆయా
పరవాడ	వాడచీపురుపల్లి	దళాయిపాలెం	అంగన్‌వాడీ ఆయా

సీఎం జగన్‌తోనే సంక్షేమం


డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు తదితరులు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ఆయననే సీఎంగా గెలిపించుకుందామని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ముత్యాలమ్మపాలెం సచివాలయ కన్వీనర్ బొంది అచ్చియ్య, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను ఆధ్వర్యంలో గ్రామంలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ముందుగా సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ప్రారంభించి, అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముత్యాలమ్మపాలెం ప్రజలకు సంక్షేమ పథకాల రూపేణ రూ.26.43 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. చంద్రబాబు హయాంలో 2019లో రాష్ట్ర తలసరి ఆదాయం 17వ స్థానంలో ఉండగా.. జగనన్న వచ్చాక 2023 నాటికి 9వ స్థానానికి చేరిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు స్పీడ్ మసేను, పైల అప్పలనాయుడు, దూడ నూకాలు, నల్ల మసేను, చంటి, వాసుపల్లి సుమిత్ర, కొవిరి నూకరాజు, మూస కొండబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న పార్టీ శ్రేణులు